APTEL/2009/29308

స్నేహిత
# ఎక్స్‌ప్రెస్

నిజం దాగదు.. వార్త ఆగదు

తెలుగు దినపత్రిక

16-02-2026
సోమవారం
హైదరాబాద్
సంపుటి: 17 । సంచిక: 116
పేజీలు: 04 । వెల: 5/-
ఎడిటర్: రాథోడ్ వినోద్ కుమార్

FOLLOW:
https://epaper.expresstelugudaily.com



కోవా బన్ వివాదంపై అసదుద్దీన్ ఒవైసీ ఆగ్రహం 2

## శివనామస్మరణతో మార్మోగిన శైవ క్షేత్రాలు

- శ్రీశైలం, యాగంటి, ఓంకారం, మహానంది, కొలనుభారతీ క్షేత్రాల్లో పోటెత్తిన భక్తులు
- శ్రీశైలం క్షేత్రంలోని పాతాళగంగ వద్ద భక్తులు బారులు
- భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ ప్రత్యేక ఆర్టీసీ బస్సులను ఏర్పాటు

**ఏపీ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా నల్లమల అభయారణ్యంలో వెలసిన శివాలయాలకు భక్తుల తాకిడి పెరిగింది. శైవ క్షేత్రాలన్నీ భక్తులతో కిక్కిరిశాయి. శైవ క్షేత్రాలకు నిలయమైన నల్లమల శివనామ స్మరణతో మార్మోగుతోంది. ప్రధానంగా ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైలం, ఏపీలో ఏకైక సరస్వతీ క్షేత్రమైన కొలనుభారతీ, సప్తనదుల సంగమేశ్వర క్షేత్రం, యాగంటి, ఓంకారం, మహానంది, మంత్రాలయం, రుద్రకోడు, గుప్తమహేశ్వర ఆలయం వంటి క్షేత్రాలకు వేల సంఖ్యలో భక్తులు చేరుకున్నారు. ప్రత్యేకించి శ్రీశైలం, యాగంటి, ఓంకారం, మహానంది, కొలను భారతీ క్షేత్రాలు భక్తులతో నిండి పోయాయి. ఆదివారం జాగారణ, సోమవారం మహాశివరాత్రి కావడంతో భక్తులంతా జాగారణ చేసేందుకు తరలి వెళ్లారు. రాత్రి వేళల్లో ఆలయాల వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అలాగే అక్కడక్కడా భక్తుల కోసం భజన, పౌరాణిక నాటక ప్రదర్శనలు చేయనున్నారు. శ్రీశైలం క్షేత్రంలోని పాతాళగంగ వద్ద భక్తులు బారులు తీరారు. భక్తుల కోసం పుట్టీల ద్వారా గత ఈతగాళ్లను ఏర్పాటు చేశారు. శివస్వాములు మాలధారణ తీసేసి ఇరుముడులు సమర్పించనున్నారు. మరోవైపు ఏపీ, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర మిగతా2లో...





2

## డిజిటల్ 'హవాలా' గుట్టురట్టు

8వేల మ్యూల్ అకౌంట్లు బ్లాక్ చేసిన ఎన్ఐఏ

జమ్మూకశ్మీర్ కేంద్రంగా అంతర్జాతీయ సైబర్ సిండికేట్

ఉగ్రవాద కార్యకలాపాలకు నిధుల మళ్లింపు?



# తండాలన్నింటికీ బీటీ రోడ్లు

## ప్రతి గూడెంలో సర్కారు బడి

### బంజారా భవన్‌లో ఘనంగా సంత్ శ్రీ సేవాలాల్ జయంతి

- వేడుకల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ప్రకటన
- రాష్ట్ర పునర్నిర్మాణంలో లంబాడాలది అగ్రభాగం
- రాబోయే నాలుగు నెలల్లోనే తండాల రూపురేఖలు మార్చేస్తాం
- లంబాడా యువత తమ కెరీర్‌ను గొప్పగా మల్చుకోవాలి
- ఊర్లోనే ఉండి వ్యవసాయం చేసుకుంటామనే పాత ధోరణిని మనసులో నుంచి తీసేయాలి
- యువత గ్రూప్-1, గ్రూప్-2 వంటి ఉద్యోగాలు సాధించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:**

తెలంగాణ రాష్ట్ర సాధనలో లంబాడా యువత పోషించిన పాత్ర వెలకట్టలేనిదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనియాడారు. హైదరాబాద్‌లోని బంజారా భవన్‌లో నిర్వహించిన సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేవలం ఉద్యమ సమయంలోనే కాకుండా, ప్రస్తుతం జరుగుతున్న రాష్ట్ర పునర్నిర్మాణంలో కూడా లంబాడాలు అత్యంత కీలకమైన బాధ్యతను భుజాన వేసుకున్నారని ప్రశంసించారు. వారి సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం స్పష్టం చేశారు.

**మౌలిక సదుపాయాలపై సీఎం సంచలన ఆదేశాలు**

తండాల అభివృద్ధిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక నిర్ణయాలు ప్రకటించారు. రాష్ట్రంలోని అన్ని లంబాడా మిగతా2లో...



## ఘోర రోడ్డు ప్రమాదం

### ఐదుగురు యువకుల దుర్మరణం

- అదుపుతప్పి డివైడర్‌పై నుంచి అవతలి లేన్‌లోకి దూసుకెళ్లిన కారు
- ఆర్టీసీ బస్సును బలంగా ఢీకొట్టడంతో నుజ్జునుజ్జు అయిన వాహనం
- మృతులంతా 17 నుంచి 22 ఏళ్ల లోపు స్నేహితులుగా గుర్తింపు
- క్షేమంగా బయటపడ్డ 43 మంది బస్సు ప్రయాణికులు

2

కర్ణాటక రాజధాని బెంగళూరులో అర్ధరాత్రి వేళ ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. మితిమీరిన వేగంతో వెళ్తున్న ఒక కారు అదుపుతప్పి డివైడర్‌పై నుంచి అవతలి లేన్‌లోకి దూసుకెళ్లి ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఐదుగురు యువకులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు.

## తారిఖ్ ప్రమాణ స్వీకారానికి.. భారత్ తరపున ఓం బిర్లా

- రేపు బంగ్లా ప్రధానిగా తారిఖ్ రెహమాన్ ప్రమాణ స్వీకారం
- వేడుకకు హాజరుకానున్న లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా
- అతిథులుగా 13 దేశాల ప్రతినిధులు



2

## మావోయిస్టులకు తెలంగాణ డీజీపీ కీలక విజ్ఞప్తి

- 15 మంది మావోయిస్టు అగ్రనేతలు జనజీవన స్రవంతిలో కలవాలి
- ఎక్స్‌గ్రేషియాతో పాటు పునరావాస పథకం కింద తక్షణ సాయం, ప్రయోజనాలు అందుతాయని సూచన



2

## జగిత్యాల మున్సిపల్ పోరు

### ముదిరిన వర్గపోరు.. ఢిల్లీ దాకా పంచాయితీ

- ఇరువర్గాల క్యాంప్ రాజకీయాలతో ఉత్కంఠ
- రంగంలోకి దిగిన అధిష్ఠానం.. సయోధ్య కోసం కసరత్తు
- జీవన్ రెడ్డితో ఏఐసీసీ సెక్రటరీ సవాంగ్, మంత్రి అడ్లూరి భేటీ
- పార్టీ జెండా మోసిన వారికే ప్రాధాన్యం: జీవన్ రెడ్డి

జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ పీఠం దక్కించుకోవడంపై కాంగ్రెస్ పార్టీలో రాజకీయం వేడెక్కింది. సీనియర్ నాయకులు జీవన్ రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్ కుమార్ వర్గాల మధ్య పోరు తారాస్థాయికి చేరడంతో అధిష్ఠానం రంగంలోకి దిగింది. శనివారం ఏఐసీసీ సెక్రటరీ సవాంగ్, మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌లు జీవన్ రెడ్డితో సమావేశమై ప్రస్తుత పరిస్థితులపై చర్చించారు. సమావేశం అనంతరం జీవన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు.



2

## కరీంనగర్ కార్పొరేషన్‌లో కాంగ్రెస్ 'ఆపరేషన్ ఆకర్ష్'

- హస్తం గూటికి ఇద్దరు ఫార్వర్డ్ బ్లాక్, ముగ్గురు స్వతంత్ర కార్పొరేటర్లు
- మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం సమక్షంలో పార్టీలో చేరిక.. ఎంఐఎం మద్దతు
- 30 సీట్లతో అతిపెద్ద పార్టీగా ఉన్న బీజేపీకి చెక్ పెట్టేలా కాంగ్రెస్ వ్యూహాలు
- 66 డివిజన్ల కార్పొరేషన్‌లో మారుతున్న సమీకరణాలు..
- ఎవరికి దక్కనుందో మేయర్ పీఠం?

2

## ఆదివారం అనూహ్య పరిణామం

- కొత్తగూడెం కార్పొరేషన్‌పై కాంగ్రెస్ ఊహించని స్టెప్
- ఐదుగురు ఇండిపెండెంట్లను పార్టీలో చేర్చుకున్న హస్తం పార్టీ
- 22 నుంచి 29కి చేరిన కాంగ్రెస్ బలం
- తెల్లారితే ప్రమాణ స్వీకారం.. ఏదైనా జరగొచ్చా..?



2

## శివనామస్మరణతో మార్మోగిన శైవ క్షేత్రాలు

(మొదటి పేజీ తరువాయి)
రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాలకు చెందిన శివస్వాములు, భక్తులు కాలినడకన నల్లమల అటవీ ప్రాంతం మీదుగా శ్రీశైలం చేరుకున్నారు. అలాగే భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ ప్రత్యేక ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేసి భక్తులను వివిధ క్షేత్రాలకు తరలించారు. పెద్ద మొత్తంలో ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేయడంతో దారి పొడవునా భక్తులతో నిండిన బస్సులే దర్శనమిచ్చాయి. శ్రీశైలం క్షేత్రంలో శివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభ సందర్భంలో భక్తులకు సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారు. ఆ తర్వాత అప్రమత్తమైన జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి, జిల్లా ఎస్పీ సునీల్ షేరాన్ లు అక్కడి పరిస్థితులపై ఆరా తీసి శ్రీశైలంలో పర్యటిస్తూ పరిస్థితులను అదుపులోకి తెచ్చారు. అయితే ఆర్టీసీ ఆర్డీనరి బస్సులకు ఎక్స్ ప్రెస్ చార్జీలు వసూలు చేయడం, ఎక్స్ ప్రెస్ బస్సులకు సూపర్ లగ్జరీ చార్జీలు వసూలు చేయడంపై భక్తులు మండిపడుతున్నారు. శ్రీశైలంలో వివిధ రాష్ట్రాలకు చెందిన ఆర్టీసీ బస్సులు, వివిధ వాహనాల కోసం పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేశారు.

## జగిత్యాల 'మున్సిపల్' పోరు

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ పీఠం దక్కించుకోవడంపై కాంగ్రెస్ పార్టీలో రాజకీయం వేడెక్కింది. సీనియర్ నాయకులు జీవన్ రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్ కుమార్ వర్గాల మధ్య పోరు తారాస్థాయికి చేరడంతో అధిష్ఠానం రంగంలోకి దిగింది. శనివారం ఏఐసీసీ సెక్రటరీ సవాంగ్, మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌లు జీవన్ రెడ్డితో సమావేశమై ప్రస్తుత పరిస్థితులపై చర్చించారు. సమావేశం అనంతరం జీవన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. పార్టీ ఆరంభం నుంచి ఉండి, బలోపేతానికి కృషి చేసిన వారికే పదవులు ఇవ్వాలని కోరానని చెప్పారు. తన వర్గానికి చెందిన వారికే చైర్మన్ పీఠం కేటాయించాలని కోరారు. పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటానని చెబుతూనే, తన సూచనలను పరిగణనలోకి తీసుకోవాలని స్పష్టం చేశారు.

**క్యాంప్ రాజకీయాల కలకలం..**
మున్సిపల్ పీఠం చేజిక్కించుకోవడానికి ఇరువర్గాలు 'క్యాంప్' రాజకీయాలకు తెరలేపాయి. కాంగ్రెస్ బీఫారంపై గెలిచిన వారు, స్వతంత్రులు, ఎంఐఎం సభ్యులతో కలిపి మొత్తం 23 మందితో ఎమ్మెల్యే సంజయ్ కుమార్ శుక్రవారమే ప్రత్యేక క్యాంప్ ఏర్పాటు చేశారు. శనివారం 14 మంది అభ్యర్థులతో జీవన్ రెడ్డి హైదరాబాద్ చేరుకోవడంతో ఉత్కంఠ మరింత పెరిగింది.

**రంగంలోకి ఏఐసీసీ ఇన్‌ఛార్జ్..**
పరిస్థితి తీవ్రతను గమనించిన ఏఐసీసీ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ నేరుగా రంగంలోకి దిగారు. జీవన్ రెడ్డితో ఫోన్‌లో మాట్లాడి సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు. అటు జీవన్ రెడ్డి, ఇటు సంజయ్ కుమార్ మధ్య సయోధ్య కుదిర్చేందుకు సీనియర్ నేతలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. రెండు వర్గాల పంతాల మధ్య చివరికి జగిత్యాల మున్సిపల్ పీఠం ఎవరిని వరిస్తుందో అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

## మావోయిస్టులకు తెలంగాణ డీజీపీ కీలక విజ్ఞప్తి

**హైదరాబాద్, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** తెలంగాణ రాష్ట్రం నుంచి మిగిలి ఉన్న మావోయిస్టులకు డీజీపీ శివధర్ రెడ్డి కీలక విజ్ఞప్తి చేశారు. 15 మంది మావోయిస్టు అగ్రనేతలు జనజీవన స్రవంతిలో కలవాలని ఆయన కోరారు. లొంగిపోయిన వారికి ప్రభుత్వం అందించే ఎక్స్‌గ్రేషియాతో పాటు పునరావాస పథకం కింద తక్షణ సాయం, ప్రయోజనాలు అందుతాయని సూచించారు. దీని ద్వారా మావోయిస్టులు వారివారి సొంతూర్లలో కుటుంబాలతో స్వేచ్ఛ, గౌరవంగా జీవించగలుగుతారని పేర్కొన్నారు. గత మూడు సంవత్సరాల్లో తెలంగాణ పోలీసుల ప్రయత్నాల ద్వారా వివిధ స్థాయిల్లోని 588 మంది మావోయిస్టు నాయకులు, కార్యకర్తలు లొంగిపోయి తమ కుటుంబాలతో సంతోషంగా జీవిస్తున్నారని తెలిపారు. ఇది రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పునరావాస కార్యక్రమాల విశ్వసనీయతకు నిదర్శనమని డీజీపీ వెల్లడించారు.

## హత్యా.. ప్రమాదమా..?

- బొగ్గుల శ్రీనివాస్ మరణం వెనుక మిస్టరీ
- పాలేరు జలాశయంలో కారు ప్రమాదం
- ప్రమాదానికి ముందే కారులోంచి డ్రైవర్ ఎస్కేప్
- డ్రైవర్ ఆచూకీ కోసం పోలీసుల గాలింపు

**హైదరాబాద్, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** యూట్యూబర్, వివాదాస్పద రచయిత బొగ్గుల శ్రీనివాస్ మరణం ప్రస్తుతం తెలంగాణ రాజకీయ, సామాజిక వర్గాల్లో పెను సంచలనంగా మారింది. ఖమ్మం జిల్లాలోని పాలేరు జలాశయంలోకి ఆయన ప్రయాణిస్తున్న కారు దూసుకెళ్లడం, ఈ ప్రమాదంలో ఆయన ప్రాణాలు కోల్పోవడం వెనుక పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా కారు వెనుక సీట్లో కూర్చున్న శ్రీనివాస్ మరణించగా, డ్రైవర్ సురక్షితంగా బయటపడి అక్కడి నుండి పరారవ్వడం ఈ మరణంపై అనేక సందేహాలకు తావిస్తోంది.

**సాఫ్ట్ వేర్ నుంచి యూట్యూబర్..**
బొగ్గుల శ్రీనివాస్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూలు జిల్లాకు చెందినవారు. ఆయన వృత్తిరీత్యా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అయినప్పటికీ, సామాజిక, రాజకీయ అంశాలపై ఉన్న ఆసక్తితో యూట్యూబర్ గా మారారు. రాజకీయ విశ్లేషణలు చేస్తూ, తనదైన శైలిలో విమర్శలు గుప్పిస్తూ సోషల్ మీడియాలో గుర్తింపు తెచ్చుకున్నారు. కేవలం విశ్లేషణలకే పరిమితం కాకుండా, సమాజంలో జరుగుతున్న పరిణామాలపై పుస్తకాలు రాయడం ద్వారా ఆయన చర్చనీయాంశంగా మారారు.

**'పవన్ కళ్యాణ్ హఠావో.. పాలిటిక్స్ బచావో'తో వివాదాల్లోకి..**
బొగ్గుల శ్రీనివాస్ పేరు ప్రముఖ్యతలోకి రావడానికి ప్రధాన కారణం ఆయన రాసిన 'పవన్ కళ్యాణ్ హఠావో.. పాలిటిక్స్ బచావో' అనే పుస్తకం. ఈ పుస్తకంలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ రాజకీయ ప్రస్థానంపై, ఆయన సిద్ధాంతాలపై శ్రీనివాస్ తీవ్రమైన విమర్శలు చేశారు. పవన్ కళ్యాణ్ రాజకీయాల్లోకి రావడం వల్ల కలిగే పరిణామాలను తన కోణంలో విశ్లేషిస్తూ రాసిన ఈ పుస్తకం అప్పట్లో పెద్ద దుమారాన్నే రేపింది. ఈ పుస్తకం విడుదలైన సమయంలో జనసేన కార్యకర్తలు, పవన్ కళ్యాణ్ అభిమానుల నుండి శ్రీనివాస్ తీవ్ర నిరసనలు ఎదుర్కొన్నారు. అనేక చోట్ల ఆయనపై దాడులు జరిగినట్లు, బెదిరింపులు వచ్చినట్లు వార్తలు వచ్చాయి. రాజకీయ నాయకులను లక్ష్యంగా చేసుకుని ఆయన చేసే విమర్శలు, ఆయన రాసిన పుస్తకాలు నిరంతరం వివాదాలకు కేంద్రబిందువుగా నిలిచేవి. ఈ నేపథ్యం వల్ల, ఇప్పుడు పాలేరు జలాశయంలో జరిగిన ప్రమాదాన్ని కేవలం ఒక ప్రమాదంగా చూడలేమని, దీని వెనుక ఏదైనా కుట్ర ఉందేమోనన్న అనుమానాలు ఆయన అనుచరులు వ్యక్తం చేస్తున్నారు.

**ప్రమాదానికి ముందే డ్రైవర్ ఎస్కేప్..**
ప్రస్తుతం పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పరారీలో ఉన్న డ్రైవర్‌ను పట్టుకుంటేనే అసలు నిజాలు బయటపడే అవకాశం ఉంది. పాలేరు జలాశయం వద్ద మత్స్యకారులు చెప్పిన వివరాల ప్రకారం, కారు నీటిలోకి వెళ్లకముందే డ్రైవర్ బయటకు దూకడం అనేక అనుమానాలను బలపరుస్తోంది. పోస్ట్‌మార్టం నివేదిక, పోలీసుల విచారణలో ఈ మిస్టరీ వీడే అవకాశం ఉంది.

## కరీంనగర్ కార్పొరేషన్‌లో కాంగ్రెస్ 'ఆపరేషన్ ఆకర్ష్'

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** కరీంనగర్ నగరపాలక సంస్థ రాజకీయం ఊహించని మలుపులు తిరుగుతోంది. ప్రధాన పార్టీల ఎత్తుగడలు, పైఎత్తులతో స్థానిక రాజకీయం రసవత్తరంగా మారింది. తాజాగా కరీంనగర్‌కు చెందిన ఐదుగురు కార్పొరేటర్లు కాంగ్రెస్ పార్టీలో చేరడం చర్చనీయాంశమైంది. ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీకి చెందిన సాయిజ్యోతి, శ్యామలతో పాటు, స్వతంత్ర కార్పొరేటర్లు కొమరయ్య, నందిని ఉదయ్, మల్లేశం హైదరాబాద్‌లో మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. వీరితో పాటు ఎంఐఎంకు చెందిన ముగ్గురు కార్పొరేటర్లు, స్వతంత్ర అభ్యర్థిగా గెలిచిన మాజీద్ హుస్సేన్ కూడా కాంగ్రెస్ పార్టీకి తమ సంపూర్ణ మద్దతు ప్రకటించడం గమనార్హం. నగర అభివృద్ధి కేవలం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని తాము నమ్ముతున్నామని, అందుకే స్వచ్ఛందంగా పార్టీలో చేరినట్లు ఈ సందర్భంగా కార్పొరేటర్లు స్పష్టం చేశారు.



**మేయర్ పీఠం వైపు కాంగ్రెస్ అడుగులు..**
ఈ తాజా పరిణామాలతో కరీంనగర్ మేయర్ పీఠం ఎవరికి దక్కుతుందనే అంశంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. కరీంనగర్ కార్పొరేషన్‌లోని మొత్తం 66 డివిజన్లలో 30 స్థానాలను గెలుచుకుని బీజేపీ అతిపెద్ద పార్టీగా అవతరించింది. కాంగ్రెస్‌కు 14, బీఆర్ఎస్‌కు 9, ఎంఐఎంకు 3 స్థానాలు దక్కగా, 10 మంది స్వతంత్రులు విజయం సాధించారు. మేయర్ పీఠాన్ని దక్కించుకోవాలంటే మ్యాజిక్ ఫిగర్ 34 (మొత్తం 66లో సగం కంటే ఎక్కువ) కావాల్సి ఉండగా, ప్రస్తుతం కాంగ్రెస్ తన బలాన్ని పెంచుకునే దిశగా అడుగులు వేస్తోంది. స్వతంత్రులు, ఇతర పార్టీల మద్దతుతో మేయర్ పీఠంపై జెండా ఎగురవేయాలని కాంగ్రెస్ వ్యూహరచన చేస్తోంది.

**బీజేపీ వ్యూహం ఎలా ఉండబోతోంది?**
అతిపెద్ద పార్టీగా అవతరించినప్పటికీ, మ్యాజిక్ ఫిగర్‌కు కొద్ది దూరంలో నిలిచిన బీజేపీని ఇరకాటంలో పెట్టేలా కాంగ్రెస్ పావులు కదుపుతోంది. ఎంఐఎం మద్దతుతో పాటు, స్వతంత్రులను తమ వైపు తిప్పుకోవడం ద్వారా కాంగ్రెస్ బలం పుంజుకుంది. అయితే, బీజేపీ కూడా మేయర్ పీఠాన్ని వదులుకోవడానికి సిద్ధంగా లేదు. ఇతర స్వతంత్రుల మద్దతు కూడగట్టేందుకు ఆ పార్టీ నేతలు కూడా ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు తెలుస్తోంది. మున్సిపల్ ఎన్నికల ఫలితాల అనంతరం మారిన ఈ సమీకరణలు కరీంనగర్ రాజకీయాల్లో కొత్త వేడిని రగిలించాయి. రానున్న రోజుల్లో మరికొందరు కార్పొరేటర్లు పార్టీలు మారే అవకాశం ఉందన్న ప్రచారం జరుగుతుండటంతో నగర రాజకీయం మరింత ఆసక్తికరంగా మారింది.

## కోవా బన్ వివాదంపై అసదుద్దీన్ ఒవైసీ ఆగ్రహం

- చిన్న వ్యాపారిని టార్గెట్ చేయడం అన్యాయమని మండిపడ్డ ఎంఐఎం అధినేత
- "ఫుడ్ జిహాద్" పేరుతో సోషల్ మీడియాలో మత విద్వేష ప్రచారాలపై ఫైర్
- పొట్టకూటి కోసం వచ్చే వారిపై యూట్యూబ్ డ్రామాలు వద్దు
- ఫుడ్ సేఫ్టీ సమస్య ఉంటే అధికారులకు చెప్పాలి కానీ, మతరంగు పులమడం ఏంటి?

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** మేడారం జాతరలో చోటుచేసుకున్న "కోవా బన్" వివాదంపై ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ స్పందించారు. కర్నూలు నుంచి పొట్టకూటి కోసం వచ్చిన వలీ అనే ముస్లిం చిన్న వ్యాపారిని లక్ష్యంగా చేసుకుని, కొందరు యూట్యూబర్లు కావాలనే వివాదాన్ని సృష్టిస్తున్నారని ఆరోపించారు. "ఫుడ్ జిహాద్" అంటూ అన్ హైజీన్ సాకుతో సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంపై ఒవైసీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఒక సామాన్య వ్యాపారి తన కుటుంబ పోషణ కోసం వస్తువులు అమ్ముకుంటుంటే, అతనిపై మత ముద్ర వేసి వీడియోలు తీయడం అమానుషమని, ఇది కేవలం ఒక వ్యక్తిని కాకుండా లక్షలాది మంది చిన్న వ్యాపారుల జీవనోపాధిని దెబ్బతీస్తుందని అసదుద్దీన్ ఒవైసీ ఆవేదన వ్యక్తం చేశారు.

**మత విద్వేషం వద్దు.. అధికారులకు ఫిర్యాదు చేయండి..**
సోషల్ మీడియా వేదికగా తన గళాన్ని వినిపించిన ఒవైసీ.. ఆహార నాణ్యతలో లోపాలు ఉంటే ఫుడ్ సేఫ్టీ కమిషనర్‌కు ఫిర్యాదు చేసే అవకాశం ఉన్నప్పటికీ, యూట్యూబ్ వ్యూస్ కోసం మతపరమైన చిచ్చులు పెట్టడం సరి కాదని హితవు పలికారు. "ఇది ఏమిటి? ఒక మనిషి పొట్టకూటి కోసం కష్టపడుతున్నాడు. ఇలాంటి వీడియోల వల్ల మత విద్వేషం రెచ్చగొట్టడం ఎందుకు?" అని ఆయన ప్రశ్నించారు. వ్యూస్ కోసం సామాన్యులను బలిపశువులను చేస్తున్న యూట్యూబర్లు, ఇన్‌ఫ్లుయెన్సర్లపై ప్రభుత్వం తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

**సామాజిక మాధ్యమాల్లో వెల్లువెత్తుతున్న మద్దతు..**
ఒవైసీ చేసిన ఈ ప్రకటనతో కోవా బన్ వివాదం ఇప్పుడు రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ హాట్ టాపిక్‌గా మారింది. కేవలం మతం ప్రాతిపదికన ఒక చిరు వ్యాపారిని ఇబ్బంది పెట్టడం తగదని సోషల్ మీడియాలో నెటిజన్లు కూడా పెద్దఎత్తున స్పందిస్తున్నారు. సదరు యూట్యూబ్ ఛానెల్ తీరుపై మండిపడుతూ, చిన్న వ్యాపారులకు అండగా నిలవాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## తారిఖ్ ప్రమాణ స్వీకారానికి.. భారత్ తరపున ఓం బిర్లా

**నేషనల్ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** బంగ్లాదేశ్ నూతన ప్రధానమంత్రిగా తారిఖ్ రెహమాన్ బాధ్యతలు స్వీకరించనున్న కార్యక్రమానికి భారత్ తరపున లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా హాజరుకానున్నారు. ఈ మేరకు భారత విదేశాంగ శాఖ అధికారిక ప్రకటన విడుదల చేసింది. ఈనెల 17న ఢాకాలో జరగనున్న ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి రావాల్సిందిగా భారత ప్రధాని నరేంద్ర మోదీకి బంగ్లాదేశ్ నుంచి ఆహ్వానం అందింది. అయితే, అదే సమయంలో ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ భారత పర్యటనకు వస్తుండడంతో, దౌత్యపరమైన ముందస్తు షెడ్యూళ్ల కారణంగా ప్రధాని మోదీ ఢాకాకు వెళ్లే అవకాశం లేదని అధికారులు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో భారత ప్రభుత్వ ప్రతినిధిగా ఓం బిర్లా ఈ వేడుకలో పాల్గొననున్నారు.

**ఘనంగా ఏర్పాట్లు..**
**అతిథులుగా 13 దేశాల ప్రతినిధులు**
బంగ్లాదేశ్‌లో ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తారిఖ్ రెహమాన్ నేతృత్వంలోని బీఎన్‌పీ ఘనవిజయం సాధించిన సంగతి తెలిసిందే. ఈ విజయంతో ఆయన ఈ నెల 17న దేశ నూతన ప్రధానిగా పగ్గాలు చేపట్టబోతున్నారు. ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమాన్ని బంగ్లాదేశ్ పార్లమెంటు హౌస్‌లోని సదరన్ ప్లాజాలో అత్యంత వేడుకగా నిర్వహించేందుకు అక్కడి యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. డాక్టర్ యూనస్ నేతృత్వంలోని ప్రస్తుత తాత్కాలిక ప్రభుత్వం ఈ కార్యక్రమానికి అంతర్జాతీయ స్థాయిలో ప్రాముఖ్యత కల్పిస్తోంది.

**దౌత్య సంబంధాల బలోపేతం**
ఈ ప్రమాణ స్వీకార వేడుకకు భారత్‌తో పాటు చైనా, సౌదీ అరేబియా, పాకిస్థాన్, తుర్కియే, ఖతార్, శ్రీలంక, నేపాల్ సహా మొత్తం 13 దేశాలకు బంగ్లాదేశ్ ఆహ్వానాలు పంపింది. పొరుగు దేశాలతో సంబంధాలను పునరుద్ధరించుకోవడంలో భాగంగా ఈ ఆహ్వానాలు పంపినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. భారత్ తరపున స్పీకర్ హాజరవుతుండడం, ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాల కొనసాగింపునకు సంకేతంగా నిలవనుంది.

## తండాలన్నింటికీ బీటీ రోడ్లు.. ప్రతి గూడెంలో సర్కారు బడి

(మొదటి పేజీ తరువాయి)
తండాలకు తక్షణమే బీటీ రోడ్లు వేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఇకపై తెలంగాణలో రోడ్డు సౌకర్యం లేని తండా అంటూ ఏదీ ఉండకూడదని ఆయన స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించారు. రవాణా సౌకర్యంతో పాటు విద్యకు పెద్దపీట వేస్తూ, ప్రతి తండాలో ప్రభుత్వ పాఠశాలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. తన 20 ఏళ్ల రాజకీయ ప్రస్థానం మరో నాలుగు నెలల్లో పూర్తి కాబోతోందని, ఆలోపే తండాలన్నింటికీ రోడ్ల సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.



**వ్యవసాయం దాటి ఆలోచించండి**
లంబాడా యువత తమ కెరీర్‌ను గొప్పగా మల్చుకోవాలని రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. కేవలం ఊర్లోనే ఉండి వ్యవసాయం చేసుకుంటామనే పాత ధోరణిని మనసులో నుంచి తీసేయాలని ఆయన సూచించారు. యువత గ్రూప్ 1, గ్రూప్ 2 వంటి అత్యున్నత స్థాయి ఉద్యోగాలు సాధించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని పిలుపునిచ్చారు. నచ్చిన రంగంలో రాణించేందుకు, ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి సంపూర్ణ మద్దతు లభిస్తుందని ఆయన హామీ ఇచ్చారు.

**ఎనిమిదేళ్ల పాలన..**
**పక్కాగా హామీల అమలు**
కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుపై ముఖ్యమంత్రి క్లారిటీ ఇచ్చారు. గత పదేళ్లలో జరగని విధంగా లక్షలాది కొత్త రేషన్ కార్డుల మంజూరుతో పాటు, 50 లక్షల కుటుంబాలకు ఉచిత విద్యుత్, రూ.500లకే గ్యాస్ సిలిండర్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నామని చెప్పారు. ఇప్పటికే 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామని, ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తున్నామని గుర్తుచేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మరో ఎనిమిదేళ్ల పాటు అధికారంలో ఉంటుందని, పేద ప్రజల కష్టాలను తీరుస్తామని సీఎం ధీమా వ్యక్తం చేశారు.

## డిజిటల్ 'హవాలా' గుట్టురట్టు

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** దేశ భద్రతకు ముప్పుగా పరిణమించిన భారీ అంతర్జాతీయ 'డిజిటల్ హవాలా' రాకెట్‌ను జాతీయ దర్యాప్తు సంస్థ ఛేదించింది. సైబర్ నేరాల ద్వారా దోచుకున్న సొమ్మును ఉగ్రవాద, వేర్పాటువాద కార్యకలాపాలకు మళ్లిస్తున్నట్లు గుర్తించిన అధికారులు, ఈ సిండికేట్‌తో సంబంధం ఉన్న 8,000కు పైగా నకిలీ బ్యాంకు ఖాతాలను స్తంభింపజేశారు. మూడేళ్లపాటు సాగిన సుదీర్ఘ దర్యాప్తు అనంతరం ఈ నెట్‌వర్క్ వెనుక ఉన్న భయంకరమైన నిజాలు వెలుగులోకి వచ్చాయి.

**'మ్యూల్ అకౌంట్లే' కీలకం..**
సైబర్ ఫ్రాడ్స్ ద్వారా సంపాదించిన అక్రమ సొమ్మును వ్యవస్థలోకి చేర్చడానికి నేరగాళ్లు ఈ 'మ్యూల్ అకౌంట్లను' వాడుకుంటున్నారు. ప్రధానంగా సామాన్య ప్రజలను, నిరుద్యోగ యువతను 'సులభంగా డబ్బు సంపాదించవచ్చు' అనే ఆశ చూపి, వారి బ్యాంకింగ్ వివరాలను సేకరించి వీటిని నిర్వహిస్తున్నారు. ఒక్కో ఆపరేటర్ వద్ద 10 నుండి 30 ఖాతాలు ఉంటున్నాయి. బాధితుల నుంచి దోచుకున్న సొమ్మును క్షణాల్లో ఈ ఖాతాల్లోకి మళ్లించి, అక్కడి నుండి క్రిప్టోకరెన్సీగా మార్చి విదేశాలకు తరలిస్తున్నారు. షెల్ కంపెనీల పేరుతో ఉన్న ఖాతాల ద్వారా రోజుకు రూ.40 లక్షల వరకు లావాదేవీలు జరుగుతున్నట్లు ఎన్ఐఏ గుర్తించింది.

**పంథా మార్చిన దేశ వ్యతిరేక శక్తులు..**
2017లో నిధుల ప్రవాహంపై ఎన్ఐఏ ఉక్కుపాదం మోపడంతో, ఉగ్రవాద శక్తులు సంప్రదాయ మార్గాలను వదిలి ఈ 'డిజిటల్ హవాలా'ను ఆశ్రయిస్తున్నాయని నిఘా వర్గాలు విశ్లేషిస్తున్నాయి. చైనా, మలేషియా, మయన్మార్, కంబోడియా వంటి దేశాల నుండి ఈ నెట్‌వర్క్ నడుస్తోంది. వీరు కాశ్మీర్‌లోని యువతను ప్రభావితం చేస్తూ, విపిఎన్ ల ద్వారా కేవైసీ అవసరం లేని క్రిప్టో వాలెట్లను సృష్టిస్తున్నారు. కేవలం కమిషన్ కోసం తమ ఖాతాలను అద్దెకు ఇచ్చే వారు కూడా ఈ నేరంలో సమాన భాగస్వాములే. వీరి వల్ల అంతర్జాతీయ నేరగాళ్లకు ఆర్థిక మౌలిక సదుపాయాలు అందుతున్నాయని కేంద్ర భద్రతా సంస్థలు తెలిపాయి.

## ఆదివారం అనూహ్య పరిణామం

**ఖమ్మం, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** కొత్తగూడెం కార్పొరేషన్ లో రాజకీయాలు రోజుకో మలుపు తిరుగుతున్నాయి. నిన్నటి వరకూ సీపీఐకి (22), కాంగ్రెస్ కి (22) సమానంగా కార్పొరేషన్ సీట్లు ఉన్నాయి. దీంతో ఇరు పార్టీల పెద్దలు నిన్న రాత్రి పవర్ షేరింగ్ ఒప్పందం చేసుకున్నారు.. ఇంత వరకూ బాగానే ఉంది. సోమవారం సీపీఐ మేయర్ ప్రమాణస్వీకారం చేయాల్సి ఉంది. కాబట్టి మేయర్ అభ్యర్థిని సెలెక్ట్ చేసేశారు. రేపు అధికారికంగా మేయర్ ను ప్రకటించడమే మిగిలి ఉంది. అనుకుంటున్న తరుణంలో ఆదివారం ఉదయం రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఐదుగురు ఇండిపెండెంట్ కార్పొరేటర్లను కాంగ్రెస్ పార్టీలోకి స్వయంగా కండువాలు కప్పి మరీ ఆహ్వానించారు. దీంతో పవర్ షేరింగ్ ఒప్పందం తర్వాత, ప్రమాణ స్వీకారానికి ఒక్కరోజు ముందు ఇండిపెండెంట్ల ను కాంగ్రెస్ పార్టీ లో చేర్చుకోవాల్సిన అవసరం ఏముందనే ప్రశ్న సీపీఐ శ్రేణులతో పాటు రాజకీయ విశ్లేషకులను తొలిచి వేస్తుంది. స్వతంత్రుల ఐదుగురి చేరికతో కాంగ్రెస్ బలం 27కు చేరింది. సీపీఎం సీటు, ఎక్స్ అఫిషియో ఓటు కలిస్తే కాంగ్రెస్ బలం 29 కి చేరుతుంది. అంటే మ్యాజిక్ ఫిగర్ 31 కి కేవలం ఇద్దరు కార్పొరేట్ల అవసరం మాత్రమే ఉంటుంది. ఇక సీపీఐ విషయానికి వస్తే ఒక ఇండిపెండెంట్, ఒక ఎక్స్ అఫిషియో కలిపి 24 మంది కార్పొరేటర్లు ఉన్నారు. అంటే మెజారిటీకి ఇంకా ఏడు సీట్ల అవసరం ఉంటుంది. మొత్తం మీద కొత్తగూడెం పీఠం దక్కించుకోవడానికి ఇప్పటి వరకూ కాంగ్రెస్ కు ఇద్దరు కార్పొరేటర్ల అవసరం ఉండగా, సీపీఐకి ఏడుగురు అవసరం పడుతుంది. ఇంకా ప్రమాణ స్వీకారానికి కొన్ని గంటల సమయం మాత్రమే మిగిలి ఉంది. అంతా సవ్యంగా జరుగుతుందా లేదంటే ఉదయం వరకూ రాజకీయ సమీకరణాలు మారతయా అని వేచి చూడాల్సిందే.

## ఘోర రోడ్డు ప్రమాదం

### ఐదుగురు యువకుల దుర్మరణం

**నేషనల్ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** కర్ణాటక రాజధాని బెంగళూరులో అర్ధరాత్రి వేళ ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. మితిమీరిన వేగంతో వెళ్తున్న ఒక కారు అదుపుతప్పి డివైడర్‌పై నుంచి అవతలి లేన్‌లోకి దూసుకెళ్లి ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఐదుగురు యువకులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. కారు వేగం ఎంత ఎక్కువగా ఉందంటే, బస్సును ఢీకొన్న ధాటికి వాహనం పూర్తిగా నుజ్జునుజ్జు అయ్యింది. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మరణించిన యువకుల వయస్సు 17 నుంచి 22 ఏళ్ల మధ్య ఉంటుందని, వారంతా స్నేహితులని ప్రాథమిక దర్యాప్తులో తేలింది. ప్రమాద సమయంలో కర్ణాటక ఆర్టీసీ బస్సులో మొత్తం 43 మంది ప్రయాణికులు ఉన్నారు. కారు బలంగా ఢీకొన్నప్పటికీ, అదృష్టవశాత్తూ బస్సులోని ప్రయాణికులందరూ ఎటువంటి గాయాలు లేకుండా సురక్షితంగా బయటపడ్డారు. ప్రమాదం జరిగిన వెంటనే అప్రమత్తమైన అధికారులు, ప్రయాణికులను మరో బస్సులో వారి గమ్యస్థానాలకు పంపించారు. అయితే, కారులోని యువకులు మాత్రం కారులోనే ఇరుక్కుపోయి విగతజీవులుగా మారారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తును వేగవంతం చేశారు. రాత్రి వేళ అతివేగంగా కారు నడపడమే ప్రమాదానికి ప్రధాన కారణమని ప్రాథమికంగా భావిస్తున్నారు. అయితే, కారు నడిపిన యువకుడు లేదా కారులో ఉన్న ఇతరులు మద్యం సేవించి ఉన్నారా? అనే కోణంలో కూడా పోలీసులు విచారణ జరుపుతున్నారు. ఇందులో భాగంగా మృతుల రక్త నమూనాలను సేకరించి ఫోరెన్సిక్ పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపినట్లు పోలీస్ ఉన్నతాధికారులు వెల్లడించారు.



# యువత సేవాలాల్ మహారాజ్ బాటలో నడవాలి

- సేవాలాల్ జయంతి అధికారికంగా నిర్వహించాలి
- ఫిబ్రవరి 15న సేవాలాల్ మహారాజ్ జయంతి
- ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలి
- గురవాయిగూడెం సర్పంచ్ బానోత్ బిక్షం నాయక్
- కూసుమంచి మండలంలో బైక్, డీజే తో గిరిజనులు
- సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతిని ప్రతి తండాలో నిర్వహించాలి
- సేవాలాల్ జయంతి ఉత్సవాలకు ప్రభుత్వం ప్రతి జిల్లాకు 10 కోట్లు కేటాయించాలి
- కూసుమంచి మాజీ జడ్పీటీసి రామచంద్ర నాయక్





**కూసుమంచి,స్నేహిత ఎక్స్ ప్రెస్:** నేడు సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతిని ప్రతి తండాలో ఘనంగా నిర్వహించాలని మాజీ జడ్పీటీసీ రామచంద్రన్నాయక్ అన్నారు.ఈ సందర్భంగా ఆయన ఓ ప్రకటనలో మాట్లాడుతూ..ఫిబ్రవరి 15న సేవాలాల్ మహారాజ్ జయంతిని ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నాము అన్నారు. సేవాలాల్ జయంతి ఉత్సవాలకు ప్రభుత్వం ప్రతి జిల్లాకు 10 కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు.బంజారాలకు దిశా నిర్దేశం చేస్తూ దేశవ్యాప్తంగా పర్యటిస్తూ ఎన్నో అవాంతరాలు ఎదురైనా వాటిని ఎదిరించి బోధనలుచేస్తూ బంజారా సమాజాన్ని చైతన్యవంతం చేసిన గొప్ప సంఘ సంస్కర్తగా,పోరాట యోధుడు శ్రీ సేవాలాల్ మహారాజ్..బంజారాలు సంచార జీవనం వదిలి తండాలను నిర్మించుకొని స్థిర నివాసాలుగా మార్చుకోవాలన్నారు.బంజారాలకున్న అపారమైన పశుసంపదతో వ్యవసాయాన్ని అభివృద్ధి చేసుకోవాలన్నారు.నాడుసంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి సంత్ సేవాలాల్ మహారాజ్‌ను లంబాడీలు దేవుడిగా భావించి కొలుస్తారు.ఆయన జయంతిని పండుగలా జరుపుకొంటారు. గిరిజనులకు దశదిశను చూపి, హైందవ ధర్మం గొప్పదనం, విశిష్టతలను తెలియ జేయడానికే సేవాలాల్ మహారాజ్ జన్మించారని చరిత్రకారులు చెబుతారు. బంజారా జాతి ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటేలా అహింసా సిద్ధాంతానికి పునాదులు వేశారు. దీంతో శ్రీ సంత్‌సేవాలాల్ ఇతర కులాలవారికి కూడా ఆదర్శ మూర్తిగా నిలిచారు. సర్పంచ్ బానోతు బిక్షం నాయక్ మాట్లాడుతూ..1739 ఫిబ్రవరి 15న అనంతపురం జిల్లా రాంజీనాయక్ తండాలో సేవాలాల్ మహారాజ్ జన్మించారు. జగదాంబ మాతనే తన మార్గదర్శకురాలిగా, గురువుగా స్వీకరించి ఆమె ఆదేశానుసారం బంజారాల సేవలో నిమగ్నమయ్యారు. సేవాలాల్ ప్రజల మూఢవిశ్వాసమైన జంతుబలికి తీవ్ర వ్యతిరేకి. బంజారాలు రాజుల కాలం నుంచి బ్రిటిష్ కాలం వరకు వివిధ రాజ్యాలకు అవసరమైన యుద్ధ సామాగ్రిని చేరవేస్తూ సంచార జీవనం సాగిస్తుండేవారు అని అన్నారు. ఆ క్రమంలో బ్రిటిష్,ముస్లిం పాలకుల మత ప్రచారం వల్ల బంజారా సమాజం అనేక ఇబ్బందులకు గురైంది.ఈ క్రమంలోనే బంజారా జాతిని సన్మార్గంలో నడిపించేందుకు సేవాలాల్ మహారాజ్ అవతరించారని చరిత్రకారుల ద్వారా తెలుస్తోంది. సేవాలాల్ మహారాజ్, దండి మేరా మయాడీలను భక్తిశ్రద్ధలతో పూజిస్తూ లంబాడీలు ప్రతి ఏటా తీజ్ ఉత్సవాలను కూడా జరుపుకొంటారు. అనంతపురం జిల్లా గుత్తిలోని గొల్లలదొడ్డి ప్రాంతంలో కుల దైవమైన సేవాలాల్ మహారాజ్ గఢ్ ఉంది.సేవాలాల్ శివ పూజారుడు ఆయన తండ్రి, తాతలు తెగ పెద్దలు తొమ్మిది రోజుల పాటు పెళ్లికాని యువతులు తీజ్ ఉత్సవాల్లో పాల్గొని తమకు వివాహం కావాలని పూజలు చేస్తారు. సంత్ సేవాలాల్ మహారాజ్ ప్రజల కోసం చేసిన ఉద్యమాలలో ధర్మ ప్రచారం, ఆర్థిక సంస్కరణలు, మత మార్పిడులను అరికట్టడం వంటివి ఉన్నాయి. సన్మార్గంలో తన జాతిని నడిపించి భారత్‌లోని దాదాపు 11 కోట్ల బంజారా లకు ఆరాధ్య దైవంగా ఆయన నిలిచారు.బంజారాలు రాజపుత్రుల్లాంటి వారని చరిత్ర కారుడు కల్నల్ టాడ్ పేర్కొన్నారంటే...వారెంత దృఢకాయులో అర్థం అవుతుంది. లంబాడీలు, బంజారాలు, సుగాలీలు, గ్వార్ భాయ్ అని పిలవబడుతున్న ఈ గిరిజనులు ప్రపంచ వ్యాప్తంగా గోర్ బంజారాలుగా పేరుపొందారు. మధ్య యుగంలో మహమ్మద్ ఘోరీకి వ్యతిరేకంగా పృథ్వీరాజ్ చౌహాన్ పక్షాన పోరాడిన వీరోచిత చరిత్ర బంజారాల సొంతం. దక్కన్ పీఠభూమిలో లంబాడీలు కాకతీయుల కంటే ముందే ఉన్నారని, సంచార జాతివారైనా వీరు రజాకార్లతో పోరాడారని, నవాబులు వారి ధైర్యసాహసాలకు మెచ్చి భూములను ఇనాములుగా ఇచ్చారని చరిత్ర చెబుతోంది. బంజారాలు ఎవరికీ హాని తలపెట్టే వారు కాదని, సహాయ గుణం విరివిగా కలవారని, ధైర్యసాహసాలకు ప్రతీకలనీ చరిత్ర ద్వారా తెలుస్తుంది. తరతరాలుగా జాతి వివక్షకు గురవుతూ ఆర్థిక, సామాజిక, రాజకీయ అభివృద్ధిలో వెనుకబడి ఉన్న లంబాడాలను అభివృద్ధి చేయాల్సిన అవసరముంది.



## కంగ్టిలో ఘనంగా సేవలాల్ మహారాజ్ 287వ జయంతి వేడుకలు

**పాల్గొన్న వివిధ గ్రామాల బంజారాలు**



**కంగ్టి,స్నేహిత ఎక్స్ ప్రెస్:** సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గం కంగ్టి మండల కేంద్రంలో ఆదివారం నాడు సుభాష్ చంద్రభోస్ కూడలి వద్ద సేవాలాల్ మహారాజ్ 287వ జన్మదిన వేడుకలో బంజారా నృత్యం ప్రదర్శన చేసిన సహోదరి,సహోదరులు, బైక్ ర్యాలీ చెప్పటం జరిగింది శనివారం నాడు రాత్రి,మందిరం వద్ద, జాగరణ, భజన కార్యక్రమం చేసి ఆదివారం నాడు తమ తాండ భవాని,శ్రీ సేవాలాల్ మందిరం వద్ద భోగ్ బండర్ చేసి అన్న ప్రసాదం పంచి పేట్టారు.తదనంతరం కంగ్టి మండలం కు వచ్చి సుభాష్ చంద్ర భోస్,కూడలి నుండి,అంబేద్కర్ గుండా బసవేశ్వర్ చౌక్, వరకు వెళ్లి భవాని మందిరం కు చేరుకున్నారు.బంజారాలు అందరు కలిసి మందిరంలో నైవేద్యం ను పంచి పేట్టారు.ఈ కార్యక్రమంలో రాజా రాంతాండ,ముకుంద నాయక్ తాండ, జీర్గి తాండ,దెగుల్ వాడి చందర్ తాండ, సాదు తాండ, చింతామణి తాండ, పార్థు తాండ,హాబ తాండ,టోపా తాండ,చుట్టూ గ్రామల సర్పంచ్,నాయకులు,కారోబారి, పూజారులు,శ్రీ సేవాలాల్ యూత్, అందరూ వారి సంప్రదాయ నృత్యం చేశారు వారితో పాటు స్థానిక ఎస్ఐ దుర్గా రెడ్డి కూడా కలిసి నృత్యం చేసారు.ఈ జయంతి ఎంతో ఉత్సాహంగా జరుపుకొన్నారు.

## గిరిజనుల ఆరాధ్య దైవం సంతు శ్రీశ్రీశ్రీ సేవలాల్ మహారాజ్

**ఎమ్మెల్యే పట్లోళ్ల డాక్టర్ సంజీవరెడ్డి**



**నారాయణఖేడ్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** గిరిజనుల ఆరాధ్య దైవం సంతు శ్రీశ్రీశ్రీ సేవాలాల్ మహారాజ్ అని స్థానిక ఎమ్మెల్యే పట్లోళ్ల డాక్టర్ సంజీవరెడ్డి అన్నారు. ఆదివారం ఖేడ్ పట్టణంలోని ఎమ్మెల్యే పట్లోళ్ల డాక్టర్ సంజీవరెడ్డి స్వగృహంలో మున్సిపాలిటీలోని సేవలాల్ చౌక్ దగ్గర నిర్వహించిన సేవాలాల్ జయంతి వేడుకల్లో స్థానిక ఎమ్మెల్యే పట్లోళ్ల డాక్టర్ సంజీవరెడ్డి, ఉమ్మడి మాజీ ప్రణాళిక సభ్యులు నగేష్ కుమార్ శెట్కర్ భోగ్ బండార్ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చిన్నప్పటి నుంచి దైవ భక్తుడని, ఆయన చూపిన మార్గంలోని గిరిజనులు నడుచుకోవాలని తెలిపారన్నారు. దేశంలోని గిరిజనుల అందరికీ ఏకతాటి పైకి తేవడానికి అనేక ప్రయత్నాలు చేశారన్నారు. అలాగే గిరిజనులందరూ శాకాహారాన్ని మాత్రమే స్వీకరించాలని ఒక ఉద్యమాన్ని కూడా తీసుకువచ్చిన మహనీయుడు అని అన్నారు. మాంసాహారం తో పాటు మందు, మత్తు పదార్థాలు తీసుకోరాదని గిరిజన ప్రజలకు హితోపదేశం ఇచ్చారన్నారు. ఆయన సమ సమాజం నిర్మాణం కోసం పాటుపడి సనాతన ధర్మాన్ని ముందుకు తీసుకెళ్లడానికి కృషి చేశారన్నారు. బంజారా లందరూ భక్తిశ్రద్ధలతో సాతీ భవానీ లను పూజించడం మొదలుపెట్టారన్నారు. అలాగే ప్రస్తుతం గిరిజనుల సమాజంలో నెలకొన్న దుస్థితిని పారదోలాడడానికి ఒక మహోన్నతమైన వ్యక్తి కావాలనే ఆకాంక్ష వారిలో ఉండేదన్నారు. గిరిజనుల భవిష్యత్తు బాగుండాలని దృఢ సంకల్పంతో సాతీ భవాని మాత నుంచి వరాల పొందే ప్రయత్నం చేశారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి ఉత్సవాలు

**పిచేర్యాగడి (ఏ) పాత తాండలో ఘనంగా జయంతి వేడుకలు**



**జహీరాబాద్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలోని పిచేర్యాగడి (ఏ) పాత తాండ గ్రామ పంచాయతీ ఆవరణలో భవాని మాత, సేవాలాల్ మహారాజ్ ఆలయం వద్ద సద్గురు సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి.ఈ సందర్భంగా తండాలోని సేవాలాల్ ఆలయాన్ని పూలతో ముస్తాబు చేసి,భక్తులు ప్రత్యేక పూజలు మరియు భోగ్ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో తాండ వాసులు తదితర ప్రాంతాల నుండి గిరిజన వాసులు,సేవాలాల్ భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు.

**పాల్గొన్న ముఖ్య నేతలు,కమిటీ సభ్యులు**

ఈ కార్యక్రమంలో కోహీర్ మండల కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షులు రాథోడ్ వినోద్ కుమార్,స్థానిక సర్పంచ్ రామావత్ భీమి బాయి,భవాని మాత సేవాలాల్ ఆలయ కమిటీ చైర్మన్ గోపాల్ రాథోడ్, మరియు విట్టల్ మహారాజ్, నూతన వార్డు సభ్యులు రవీన సంజు రాథోడ్,రామావత్ హస్లీ బాయి,అనూష బాయి రవి చౌహన్,తదితరులు పాల్గొన్నారు.గ్రామ సర్పంచ్ రామావత్ భీమి బాయి వినోద్ కుమార్, మాట్లాడుతూ.. సేవాలాల్ మహారాజ్ చూపిన మార్గం గిరిజన జాతికి ఆదర్శమని కొనియాడారు.కావున బంజారాలు సేవాలాల్ మహారాజ్ చూపిన మార్గంలో ప్రతి ఒక్కరు నడుచుకోవాలని వారు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో తాండ వాసులు తదితరులు పాల్గొన్నారు.



## గుడి నిర్మాణానికి విరాళం అందించిన చంద్రకాంత్ రెడ్డి

**రేణుక ఎల్లమ్మ తల్లీ గుడి నిర్మాణం కోసం 40వేల రూపాలు విరాళం**



**చౌడాపూర్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** వికారాబాద్ జిల్లా చౌడాపూర్ మండల కేంద్రంలోని కొత్తపల్లి గ్రామంలో శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లీ గుడి నిర్మాణం కోసం 40000/వేయిల రూపాయలను చౌడాపూర్ మండల బిఆర్ఎస్ పార్టీ యువ నాయకులు పుర్సంపల్లి చంద్రకాంత్ రెడ్డి గర్భ గుడి ద్వారం కోసం విరాళం అందించారు.ఈ సందర్భంగా వారిని శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి గుడి నిర్మాణం దగ్గర ద్వారకానికి గ్రామస్తుల ఆధ్వర్యంలో చంద్రకాంత్ రెడ్డి ప్రత్యేకంగా ద్వారకానికి తొలి పూజ నిర్వహించారు. వారికి గ్రామస్తులు శాలువాతో సన్మానించారు.వారికి శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి దీవెనలతో ఆయురు ఆరోగ్యాలతో ఎల్లప్పుడూ సుఖ సంతోషాలతో ఉండాలని కోరుతూ..ఈ కార్యక్రమంలో చంద్రకాంత్ రెడ్డి,వార్డ్ మెంబర్ జోగు వెంకటమ్మ శ్రీనయ్య,వార్డ్ మెంబర్ పెంటల చెన్నయ్య,అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు విష్ణు,జోగు రాములు,పెంటల చంద్రయ్య, పెంటయ్య,ఎడ్ల రమేష్,పెంటల నర్సింలు,తుమ్మ కేశవులు,పెంటల చంద్రయ్య,పెంటల గోపాల్,జోగు సతీష్,మేస్త్రి పెంటల శేఖర్,విజయ్,జోగు యాదయ్య,పెంటల శీను, పెంటల నవీన్,పెంటల రమేష్,కేశవులు,కుమార్ పెంటల చెన్నయ్య మరియు గ్రామస్తులు మహిళలు యువకులు తదితరులు పాల్గొన్నారు.

## మహాశివరాత్రి వేళ శివాలయాలు భక్తులతో కిటకిట

**నారాయణఖేడ్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని నారాయణఖేడ్ నియోజకవర్గంలోని శివాలయాలు భక్త జనసంద్రంగా మారాయి. తెల్లవారుజామున నుంచే భక్తులు ఆలయాలకు తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు.పంచగామ, తుర్కపల్లి గ్రామాలతో పాటు శంకరంపేట మండలంలోని కొప్పల్ ప్రాంత శివాలయాల్లో భక్తులు ఉపవాస దీక్షలు ఆచరించి రాత్రి జాగరణలు, భజనలు నిర్వహించారు. శివలింగానికి పాలు, నీరు, పుష్పాలతో అభిషేకాలు చేసి స్వామి వారి ఆశీస్సులు పొందారు. శివరాత్రి సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించగా, భక్తులు భారీగా పాల్గొన్నారు. పంచగామ శివాలయం మరియు దుర్గాభవాని ఆలయంలో దంపతులు కుంకుమార్చనలు నిర్వహించారు. ఇక 41 రోజులపాటు భక్తిశ్రద్ధలతో శివమాల ధరించిన శివస్వాములు మహాశివరాత్రి రోజున మాల విరమణ చేశారు. పర్వదినం సందర్భంగా ఆలయాలు ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడాయి.




## ఘనంగా సేవాలాల్ జయంతి ఉత్సవాలు



**అధిక సంఖ్యలో పాల్గొన్న గిరిజన భక్తులు**

**చౌడాపూర్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** వికారాబాద్ జిల్లా చౌడాపూర్ మండల కేంద్రంలో యావత్ ప్రపంచ బంజారాల ఆరాధ్య దైవం సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ 287 వ జయంతొత్సవాలు ఘనంగా జరిగాయి.మండలంలోని మండల పరిధిలో అన్ని గిరిజన తాండ లలో పాటు మండల వ్యాప్తంగా ఈ వేడుకలను గిరిజన భక్తులు ఘనంగా నిర్వహించారు. సేవాలాల్ జగదంబ ప్రత్యేక పూజలు నిర్వహించి,తీపి పదార్థాలను ప్రసాదంగా సమర్పించారు. హోమం ,భోగ్ బండారు కార్యక్రమాలను నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం గొల్లకుంటా పచ్చవు కుంట తాండ మక్త వెంకటాపూర్ చౌడాపూర్ వరకు శోభ యాత్ర నిర్వహించారు. గిరిజన మహిళలు తమ వేషధారణ ధరించి నృత్యాలు చేస్తూ..డీజే పాటలతో జై సేవాలాల్ నినాదాల మధ్య ఆధ్యాత్మిక చింతనతో సాగిన ఈ ర్యాలీ అందరిని ఆకట్టుకుంది.అనంతరం గిరిజన నాయకులు మాట్లాడుతూ.. బంజారాలకు మార్గం చూపిన ధర్మ గురువు అడుగుజాడల్లో ఇప్పటి గిరిజనులు నడుచుకోవాలని ఆయన చరిత్రను తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు.ఈ కార్యక్రంలో వివిధ తాండల నాయకులు తండా పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## కిసాన్ ఆగ్రో ఇండస్ట్రీస్ రైస్ మిల్లులో

# మహిళకు తీవ్ర గాయాలు

- వడ్లు ఊడుస్తుండగా రైస్ మిల్ బెల్టులో చీర చిక్కుకొని మహిళకు ప్రమాదం
- నుజ్జు నుజ్జయిన కాళ్లు,ఒళ్లంతా తీవ్ర గాయాలు
- చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న మహిళ
- జిల్లా ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్న రైస్మిల్ యాజమాన్యం




**కోటగిరి,స్నేహిత ఎక్స్ ప్రెస్:** రైస్ మిల్లులో వడ్లు ఊడుస్తుండగా రైస్ మిల్ బెల్టులో మహిళ చీర తట్టుకుని మహిళకు తీవ్ర గాయాలైన కాళ్లు,చేతులు విరిగిన ఘటన కోటగిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని పోతంగల్ మండల కేంద్రంలో గల కిసాన్ ఆగ్రో ఇండస్ట్రీస్ రైస్ మిల్లులో చోటుచేసుకుంది. స్థానికులు,పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.కొత్తపల్లి గ్రామానికి చెందిన రేణి మొగులమ్మ(40) పోతంగల్ గ్రామంలోని కిసాన్ ఆగ్రో ఇండస్ట్రీస్ రైస్ మిల్లులో కూలి పని చేస్తుంది.ఆదివారం ఆమె రైస్ మిల్లులో నడుస్తున్న మిషనరీ పక్కనే ఊడుస్తుండగా ప్రమాదవశాత్తు ఆమె చీర రైస్ మిల్ మిషన్ బెల్ట్ కు చుట్టుకొని ఆమె బెల్ట్ మీద పడి మిషన్ లోకి దూసుకెళ్లింది దీంతో ఆమె రెండు కాళ్లు, కుడి చేయి విరిగి నుజ్జయ్యింది, మొహానికి శరీరానికి తీవ్ర గాయలయ్యాయి.మిషన్లో చిక్కుకుని తీవ్ర గాయాలైన మహిళ అరుపులు విన్న రైస్ మిల్ సిబ్బంది మిషన్ ఆపేసి చూడగా మహిళలకు తీవ్ర గాయాలు అయి తీవ్ర రక్తస్రావం జరగటాన్ని గమనించి రైస్ మిల్ యజమానికి సమాచారం అందించారు.అతి కష్టం మీద ఆమె శరీరాన్ని బయటకు తీసిన సిబ్బంది అంబులెన్స్ కాల్ చేసి హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంలో తీవ్ర గాయాల పాలైన మహిళను ఆసుపత్రికి తరలించడంలో కాస్త ఆలస్యం అయినట్లు తెలుస్తుంది.ఆమెను నిజామాబాద్ లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో రైస్ మిల్ యాజమాన్యం చికిత్స అందిస్తున్నట్లు సమాచారం.రైస్ మిల్ మిషన్ లో చిక్కుకున్న మహిళకు తీవ్ర గాయాలు కావడంతో ఆమె ఆరోగ్య పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు.రైస్ మిల్లర్ నిర్లక్ష్యం తో ఓ పేదింటి మహిళ కుటుంబానికి కోలుకోలేని దెబ్బ తగిలిందని.రైస్ మిల్ మిషన్ నడుస్తున్నప్పుడు అశ్రద్ధగా వ్యవహరించి మిషన్ బెల్ట్ పక్కనే ఊడిపించి మహిళా కూలి ప్రాణాలతో రైస్ మిల్ యాజమాన్యం చెలగాటం ఆడిందని స్థానికులు వాపోతున్నారు.ఆ మహిళా కూలి కుటుంబం ఆమె చేసే కూలీ పని పైనే ఆధారపడి బతుకుతుందని ఆమె త్వరగా కోలుకోవాలని స్థానికులు కోరుతున్నారు.లేదంటే ఆ కుటుంబం రోడ్డున పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రమాదం జరిగిన విషయంపై బాధితురాలి భర్త సాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సునీల్ తెలిపారు.

## మహాశివరాత్రి నేపథ్యంలో

# పండ్లకు భారీ గిరాకీ

**ధరలు ఆకాశాన్నంటడంతో సామాన్యులకు భారంగా మారిన ఉపవాస ఖర్చు**



**నారాయణఖేడ్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలో పండ్లకు భారీ గిరాకీ నెలకొంది. ఉపవాస దీక్షలు పాటిస్తున్న భక్తులు పెద్ద సంఖ్యలో పండ్లు కొనుగోలు చేయడంతో నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి పండ్ల దుకాణం వద్ద రద్దీ కనిపించింది.పండ్ల విక్రేతలు “మూడు పూలు ఆరు కాయలు”అన్నట్లుగా మంచి వ్యాపారం జరుపుకుంటున్నారు.డిమాండ్ పెరగడంతో పండ్ల ధరలు కూడా ఒక్కసారిగా పెరిగాయి. సాధారణంగా 40-50 రూపాయలకు లభించే పండ్లు ప్రస్తుతం రూ.70 నుంచి రూ.100 పైగా అమ్ముడవుతున్నాయి.ధరలు పెరగడంతో సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పండుగలను ఆసరాగా చేసుకుని వ్యాపారులు అధిక ధరలు వసూలు చేస్తున్నారనే అభిప్రాయం పలువురు వ్యక్తం చేస్తున్నారు.ఉపవాస దీక్షలను విరమించేందుకు భక్తులు ప్రత్యేకంగా పండ్లు కొనుగోలు చేయడం వల్ల మార్కెట్ లో డిమాండ్ పెరిగినట్టు వ్యాపారులు చెబుతున్నారు.

## భక్తిశ్రద్ధలతో సేవాలాల్ మహారాజ్

## 287వ జయంతి ఉత్సవాలు



**నర్సింహులపేట,స్నేహిత ఎక్స్ ప్రెస్:** అజ్మీర తండ గ్రామ పంచాయతీ శివారులోని చందాగడ్ ఎర్రకుంట తండాలో సద్గురు సంత్ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి.ఈ సందర్భంగా తండాలోని సేవాలాల్ ఆలయాన్ని పూలతో ముస్తాబు చేసి, భక్తులు ప్రత్యేక పూజలు మరియు భోగ్ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో గ్రామ పంచాయతీ పరిధిలోని ఎర్రకుంట తండా, అజ్మీర తండా, బుడ్డ తండా,వాంకుడోతు తండా, సోమ్లా తండా,లాలితండా,పూసల తండా తదితర ప్రాంతాల నుండి గిరిజన వాసులు, సేవాలాల్ భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు.



**పాల్గొన్న ముఖ్య నేతలు,కమిటీ సభ్యులు**

ఈ కార్యక్రమంలో సేవాలాల్ ఆలయ కమిటీ కన్వీనర్ మరియు పూజారి బానోతు వెంకన్న మహారాజ్, నూతన ఆలయ కమిటీ చైర్మన్ భూక్యా మల్సూర్ నాయక్,వైస్ చైర్మన్ బానోతు కీమా నాయక్, కోశాధికారి అజ్మీరా నెహ్రూ నాయక్ పాల్గొన్నారు. గ్రామ సర్పంచ్ అజ్మీర సేవియా నాయక్, ఉపసర్పంచ్ నరేష్ నాయక్ మాట్లాడుతూ..సేవాలాల్ మహారాజ్ చూపిన మార్గం గిరిజన జాతికి ఆదర్శమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో గౌరవ సలహాదారులు టీచర్ భూక్య నాగేష్ నాయక్,బానోత్ దీప్లా నాయక్,అజ్మీర మోహన్,బానోత్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.




# సూర్య బండ తండా గ్రామ పంచాయతీలో సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు

**నర్మెట్ట,స్నేహిత ఎక్స్ ప్రెస్:** లంబాడి-బంజారా సమాజం ఆరాధ్య దైవం, సద్గురు శ్రీ సేవాలాల్ మహారాజ్ 278 వ జయంతి సందర్భంగా నర్మెట్ట మండల పరిధిలోని సూర్య బండ తండా గ్రామపంచాయతీలో మహ భోగ్ బండారు కార్యం క్రమం నిర్వహించి భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా గిరిజన నాయకులు మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్రంలో నివసిస్తున్న లంబాడి - బంజారా సమాజం కోట్లాది ప్రజల ఆధ్యాత్మిక మార్గదర్శకుడు,సంస్కృతి పరిరక్షకుడు,ధర్మరక్షకుడు సద్గురు సేవాలాల్ మహారాజ్,ఆయన బంజారా జాతి అభ్యున్నతి కోసం చేసిన త్యాగాలు,సమాజ చైతన్యం కోసం చేసిన కృషి,హిందూ ధర్మ పరిరక్షణకు అందించిన సేవలు అపారమైనవి. ఆయన చూపించిన మార్గం సమానత్వం,నీతి,సేవాభావం, ఐక్యతకు ప్రతీకగా నిలిచింది. అని వారి మార్గంలో గిరిజన సమాజమంతా నడవాలని వారి సేవలను వారి ఆశయాలను కొనసాగించాలని ఇతర సామాజిక వర్గాల మహనీయుల జయంతుల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అధికారిక సెలవులు ప్రకటిస్తున్న నేపథ్యంలో, లంబాడి-బంజారా సమాజానికి ఆధ్యాత్మిక ప్రేరణగా నిలిచిన సద్గురు సేవాలాల్ మహారాజ్ జయంతి రోజున కూడా అధికారిక సెలవు ప్రకటించడం ప్రభుత్వ ధర్మమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్,ఉప సర్పంచ్, వార్డు సభ్యులు,మాజీ ప్రజాప్రతినిధులు గ్రామ పెద్దలు నాయకులు యువకులు యువజన సంఘాల నాయకులు మహిళలు భారీ ఎత్తున పాల్గొన్నారు.




# బంజారా ధర్మ గురువు సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాలు

**అధిక సంఖ్యలో పాల్గొన్న గిరిజన భక్తులు**

**అల్లాదుర్గం,స్నేహిత ఎక్స్ ప్రెస్:** యావత్ ప్రపంచ బంజారాల ఆరాధ్య దైవం సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ 287 వ జయంతోత్సవాలు అల్లాదుర్గం మండలంలో ఘనంగా జరిగాయి. మండలంలోని ముప్పారం తండా, గొల్లకుంటా,నడిమితండా, ఆప్పాజీపల్లి తాండలతో పాటు మండల వ్యాప్తంగా ఈ వేడుకలను గిరిజన భక్తులు ఘనంగా నిర్వహించారు. సేవాలాల్ జగదంబ మాత ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి,తీపి పదార్థాలను ప్రసాదంగా సమర్పించారు. హోమం ,భోగ్ బండారు కార్యక్రమాలను నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.అనంతరం గొల్లకుంటా తాండనుండి మండల కేంద్రమైన అల్లాదుర్గం వరకు ముప్పారం తండా నుండి బోడ్మట్ పల్లి వరకు శోభ యాత్ర నిర్వహించారు. గిరిజన మహిళలు తమ వేషధారణ ధరించి నృత్యాలు చేస్తూ ,డీజే పాటలతో జై సేవాలాల్ నినాదాల మధ్య ఆధ్యాత్మిక చింతనతో సాగిన ఈ ర్యాలీ అందరిని ఆకట్టుకుంది.అనంతరం గిరిజన నాయకులు మాట్లాడుతూ.. బంజారాలకు మార్గం చూపిన ధర్మ గురువు అడుగుజాడల్లో ఇప్పటి గిరిజనులు నడుచుకోవాలని ఆయన చరిత్రను తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు.చివరగా అన్నదాన వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రంలో వివిధ తాండల నాయకులు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొప్పుల



శశిధర్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దేశ్పాండే సుభాష్ రావు, గొల్ల కుంట తండా సర్పంచ్ మన్య నాయక్, మాజీ సర్పంచ్ రాథోడ్ శివరాం, రంజిత్, దేవసోత్ రాములు నాయక్,శంకర్ నాయక్, జైపాల్ నాయక్,కృష్ణమూర్తి నాయక్, గణేష్, వెంకటేష్, గిరిజన నాయకులు,కార్బరిలు ,సర్పంచులు తండా పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# కొండంత ప్రేమతో పెదవంత ముద్దు



రవితేజ హీరోగా రూపొందుతున్న ఎమోషనల్ యాక్షన్ ఎంటర్‌టైనర్ ‘ఇరుముడి’. శివ నిర్వాణ దర్శకుడు. ప్రతిష్టాత్మక మైత్రీమూవీమేకర్స్ పతాకంపై నవీన్ యర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్నది. రవితేజ హీరోగా రూపొందుతున్న ఎమోషనల్ యాక్షన్ ఎంటర్‌టైనర్ ‘ఇరుముడి’. శివ నిర్వాణ దర్శకుడు. ప్రతిష్టాత్మక మైత్రీమూవీమేకర్స్ పతాకంపై నవీన్ యర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్నది. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఈ సినిమాలో కథానాయికగా నటిస్తున్న ప్రియా భవానీశంకర్ ఫస్ట్ లుక్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఈ సినిమాలో ఆమె ‘కావేరి’ అనే పాత్రను పోషిస్తున్నట్టు మేకర్స్ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఫస్ట్ లుక్‌లో ప్రియా భవానీశంకర్ బుగ్గపై హీరో రవితేజ ముద్దుపెడుతూ కనిపించగా, ఆమె సహజమైన ఆహార్యంతో అందంగా నవ్వుతూవుంది. హీరోహీరోయిన్ల మధ్య ప్రేమను ఈ పోస్టర్ ఆవిష్కరిస్తున్నది. నేపథ్యంలో ఉన్న అరటిపళ్ల బండి, హీరోహీరోయిన్ల ఆహార్యాలను బట్టి ఇది గ్రామీణ నేపథ్యంతో కూడిన సినిమా అని తెలుస్తున్నది. ఎమోషన్స్, కమర్షియల్ ఎలిమెంట్స్‌తో కూడిన పవర్‌ఫుల్ కథ ఇదని, తండ్రీకూతుళ్ల అనుబంధం ఈ కథకు హైలైట్ అని మేకర్స్ చెబుతున్నారు. రవితేజ కూతురుగా బేబీ నక్షత్ర నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: విష్ణుశర్మ, సంగీతం: జి.వి.ప్రకాష్‌కుమార్.

Printed, Published, Edited & Owned by **Rathod Vinod Kumar**, Printed At Falcon Printing Press, **SNEHITHA PUBLICATIONS** #1-2-201,Shop No 2, Khan Street, Zaheerabad Town,Sangareddy Dist: Pin :502220, State :Telangana, Published at SNEHITHA PUBLICATIONS #1-2-201,Shop No 2, Khan Street, Zaheerabad, 502220, Dist: Sangareddy, T.S., Editor: **Rathod Vinod kumar**, RNI. No. APTEL/2009/29308, Cell: 9550021491,8341021491Mail :expresstelugudaily@gmail.com